క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న మహిళలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు కాంత్రినగర్ లో క్రాంతి స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహించేందుకు శుక్రవారం కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా పాల్గొని పూజలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉత్సవాలను జరపాలని సూచించారు.కార్యక్రమంలో జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో సమస్యలపై ప్రశ్నించండి



కార్యక్రమంలో పాల్గొన్న ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ ప్రతినిధులు

మల్కాపురం: గ్రామంలోని ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్థాయికి ప్రతి మహిళ ఎదగాలని, నేర రహిత సమాజ స్థాపనకు తమ వంతు సాయం ఉండాలని ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. 58వ వార్డు ములగాడలో శుక్రవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు ప్రతి మహిళ సాకారం అందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలను నిలదీసే స్థాయికి చేరాలన్నారు.మహిళలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరి భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుంచారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయ దాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రంలను అందించారు.

చినుకు పడితే.. కునుకు కరువు

- గెడ్డ ఆక్రమణతో ఇక్కట్లు
- చిన్న వర్షం పడినా ఇళ్లలోకి నీరు
- కష్టాలు తీర్చాలని జనతా కాలనీ వాసుల ఆవేదన



చెరువులా మారిన ఇల్లు



ఇటీవల జనతా కాలనీ వీధుల్లోకి వచ్చిన వర్షపు నీరు



కుచించుకు పోయిన జనతా కాలనీ గెడ్డ



ఇంట్లోకి చేరిన వర్షపు నీరు (ఫైల్)

గోపాలపట్నం: ఆ ప్రాంత ప్రజల్లో అలజడి మొదలైంది. వరుసుగా కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతంలోని నివాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. గెడ్డ ఆక్రమణలు తమ పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటే ఆ కాలనీ వాసుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని జనతాకాలనీ వాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

ఆక్రమణలతో ముప్పు

గెడ్డ స్థలాన్ని ఆక్రమించడం వల్ల ఈ ప్రాంత వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో స్థానిక నాయకులు కబ్జా చేసి చిన్న ప్లాట్లను రూ.3 లక్షల నుంచి రూ. 4 లక్షల చొప్పున తెగనమ్ముకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో 50 అడుగుల గెడ్డ కాస్తా మురుగు కాల్వ కంటే చిన్నదిగా మారిపోయింది. అప్పటి నుంచి ఏ మాత్రం వర్షం కురిసినాఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు జనతా కాలనీని ముంచేస్తోంది.

ముంచెత్తిన నీరు

ఇటీవల కురిసిన వర్షానికి కాలనీలో చాలా వీధులు వర్షం నీటి తో మునిగిపోయా యి. ఇళ్లలోకి నీరు చేరడంతో ఇంట్లో వస్తువులు, వంట సామగ్రి వంటి వస్తువులు తడిపోయాయని వాపోయారు.

నీరు వెళ్లే దారి లేకే ..

వర్షపు నీరు వెళ్లే దారిలేకే ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు కబ్జా చేసి విక్రయించిన స్థలాలకు అనధికారిక పట్టాలు సైతం ఇచ్చేశారని ఆరోపిస్తున్నారు. దీని వల్ల 50 అడుగుల గెడ్డ కాస్తా మురుగు కాల్వలా తయారయిందని వాపోతున్నారు. వర్షం పడితే తమకు కంటిమీద కునుకు లేకుండా.. భయంతో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డ విస్తరించడమే మార్గం

జనతా కాలనీ వాసులను ముంపు ముప్పు నుంచి ఒడ్డు ఎక్కించాలంటే గెడ్డ ఆక్రమణలు తొలగించడమే మార్గమని పలువురు చెబుతున్నారు. ఆ విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. గెడ్డ విస్తీర్ణాన్ని గుర్తించి అక్రమ నిర్మాణాలు తొలగించి వర్షపు నీరు సజావుగా పారే విధంగా చేయాలని కోరుతున్నారు.

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మలేరియా అధికారి రవికుమార్

మల్కాపురం: జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మల్కాపురం మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ సూచించారు. 59వ వార్డు హనుమాన్‌నగర్ వద్ద శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే – డ్రై డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల వల్ల అనేక వ్యాధులు దరి చేరే అవకాశాలున్నాయన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల వ్యాప్తికి చెక్ చెప్పవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వుడా లేఅవుట్‌లో వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ లోని రోడ్ల వెంబడి వేసిన గృహనిర్మాణ వ్యర్థాలను శుక్ర వారం తొలగించారు. ఈ పనులను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యవేక్షించారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన రోడ్లా.. డంపింగ్ యార్డులా అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయాల్లో డంపింగ్ చేస్తున్నారని జీవీఎంసీ శానిటరి ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ మూర్తి చెప్పారు. పోలీస్ వారి స్థలం కావడంతో తాము ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. స్థానికులు పోలీసులకు మెమోరాండం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యర్థాలు తొలగించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఏయూ శతాబ్ది వేడుకలపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో విస్తృత స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్, డీన్లు, ఆచార్యుల సూచనలను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ స్వీకరించి భవిష్యత్ కార్యక్రమాలకు ఒక రూపునిచ్చారు. ఈ వివరాలను వీసీ వెల్లడించారు. 'శతాబ్ది సంవత్సరానికి గుర్తుగా ఒక ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంప్, పోస్టల్ కవర్‌ను విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. విశ్వవిద్యాలయంలోని విభాగాలు, ప్రయోగశాలలను విద్యార్థులకు, యువతకు పరిచయం చేసే ఉద్దేశంతో 'ఓపెన్ హౌస్'కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను భాగస్వాములను చేస్తూ వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించాం. అంతర్జాతీయ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఒక బృహత్తర సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం. విశ్వవిద్యాలయాన్ని మరింత సుందరంగా మార్చడానికి, ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపడానికి చర్యలు తీసుకుంటాం. మద్దిలపాలెం వైపు ప్రవేశ ద్వారం వద్ద ఒక ప్రత్యేకమైన ఆర్చ్‌ను, క్యాంపస్‌లో శతాబ్ది ప్రత్యేక పైలాన్‌ను నిర్మించేందుకు చర్చ జరిగింది. మెగా స్టార్టప్ చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం.' అని వీసీ వివరించారు. ప్రతి అంశానికి కమిటీలను ఏర్పాటు చేసి.. వాటి బాధ్యతలను క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు. వర్క్‌షాపులో భాగంగా అలుమ్ని వెబ్‌పేజీని వీసీ ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రిస్కిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ విక్రయం నేరం

మహారాణిపేట: ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. విజయకుమార్ హెచ్చరించారు. శుక్రవారం సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా డ్రగ్ అసోసియేషన్, స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని, అక్రమాలకు పాల్పడే వారిపై తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. స్వర్ణలత యాంటీబయోటిక్స్ వినియోగం, వాటి దుష్ప్రభావాలపై ప్రసంగించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు ఆన్‌లైన్ నేషనల్ డ్రగ్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలపై వివరణ ఇచ్చారు. సేల్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌లో దరఖాస్తులు, అనుమతులపై అవగాహన కల్పించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కున కల్యాణి, ఇందిరా భారతి, ఎస్.కల్యాణి, సుమారు 650 మంది ఫార్మసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

నేవీ క్విజ్ పోటీలు ప్రారంభం

సింథియా: ఇండియన్ నేవీ క్విజ్ పోటీలు 'థింక్ - 2025' ఉత్సాహంగా ప్రారంభమయ్యాయని నేవీ వర్గాలు తెలిపాయి. దేశ వ్యాప్తంగా 10 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ ఏడాది జూన్ 10న ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు వివిధ విద్యా సంస్థలు, విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని, 35,740 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని తెలియజేశారు. ప్రస్తుతం ఎలిమినేషన్ రౌండ్లు జరుగుతున్నాయని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయని తెలిపారు. సెమీఫైనల్స్, ఫైనల్స్ రెండూ ఇండియన్ నేవీ యొక్క ప్రతిష్టాత్మక శిక్షణ సంస్థ అయిన కేరళలోని ఎజిమలాలోని ఇండియన్ నావల్ అకాడమీలో నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహిస్తామని వివరించారు.

వాల్తేర్ డివిజన్‌లో ముగిసిన హిందీ పక్షోత్సవాలు



హిందీ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రారంభమైన హిందీ పక్షోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా హిందీ వ్యాసరచన, నోట్, డ్రాఫ్టింగ్ పోటీలు, వక్తృత్వం, చిత్రం ఆధారిత ఆర్టికల్ రైటింగ్, షబ్దాక్షరి వంటి వివిధ పోటీలు నిర్వహించారు. హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో హిందీ అధికారి, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పూజా సింగ్ నేతృత్వంలో నిర్వహించిన హిందీపై సెమినార్, ఇంటరాక్టివ్ శిక్షణ కార్యక్రమాల్లో రైల్వే సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలను గెలుచుకున్నారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్‌ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాల్తేర్ డివిజన్ ముద్రించిన ప్రత్యేక మ్యాగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), ఇతర అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ముస్తాబవుతున్న త్రిశక్తి దేవాలయం



త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి ఒకే మండపంలో వెలిసిన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో ఈనెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. అక్టోబర్ 02 వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 23న సహస్ర సంపెంగ పుష్పార్చన, 24న సహస్ర హస్త కంకణార్చన, 25న సహస్ర హరిద్ర ఖండార్చన నిర్వహించనున్నారు. 26న సహస్ర కమల పుష్పార్చన, 27న సహస్ర కలువ పుష్పార్చన, 28న స్త్రీలచే సామూహిక మణిద్వీప వర్ణార్చన (కలశపూజ), నవవిధ సహస్ర పుష్పార్చన, 29న సామూహిక అక్షరాభ్యాసాలు, సహస్ర శ్వేత కుసుమార్చన చేయనున్నారు. 30న సహస్ర గులాబీపుష్పార్చన, సాయంత్రం అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. 1న ఉదయం సహస్ర ఫలార్చన, దసరా సందర్భంగా 2న ఉదయం వాహన పూజలు, సాయంత్రం నవచండీ యాగ మహా పూర్ణాహుతి, శమీ పూజలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లను వివిధ వర్ణాల చీరలతో వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఆయన ప్రధాన అర్చకుడు ఫణిశర్మ కోరారు.

ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలం

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగిపోతోందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగువ అచ్యుతరావు విమర్శించారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరుద్యోగి ఆవేదన సదస్సు పోస్టరు ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18 నుంచి జరగనున్నాయని ఈ సమావేశాల్లో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని కోరారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఎప్పుడు ప్రారంభిస్తారో, విధి విధానాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కార్పొరేట్ కంపెనీలకు తక్కువ ధరకు ఇస్తున్నప్పటికీ అవి కార్యకలాపాలు నిర్వహించటం లేదని దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి దొరకడం లేదన్నారు. మంత్రులు ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నారని అన్నారు. టీసీఎస్, కాగ్నిజట్, ఆదాని డేటా సెంటర్లు తక్షణమే తమ కార్యకలాపాలు నిర్వహించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఏడాదిన్నర లో ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. జనవరిలో ఉద్యోగాల నోటిఫికేషన్ ప్రకటించాలని, అమరావతి ఫ్రీజోన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే డిమాండ్లతో ఈనెల 17న విజయవాడలో జరగనున్న నిరుద్యోగి ఆవేదన సదస్సులో పెద్ద ఎత్తున యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి కొమరం సందీప్, సభ్యులు హేమంత, ఉదయ్, దుర్గా అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కొనసాగుతున్న పోరు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దినాయుడు తదితరులు

మురళీనగర్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ నిర్వహిస్తున్న పోరు బాట శుక్రవారం కొనసాగింది. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.పెద్దినాయుడు ఆధ్వర్యంలో మురళీనగర్, మాధవధార, ఏఎస్సార్ నగర్, బర్మా కాలనీ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉపాధ్యాయులు, రెండో రోజు శుక్రవారం నిరసన తెలుపుతూ మండల తహసీల్దార్ రమేష్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గోపాలపట్నం అర్బన్ మండలం అధ్యక్షుడు కురచా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వానపల్లి నరేష్, గోపాలపట్నం రూరల్ మండలం అధ్యక్షురాలు గుల్లిపల్లి శైలజ, ప్రధాన కార్యదర్శి కొటాన కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ పూర్ణచంద్రరావు, తోటకూర శ్రీధర్, బండారు వాసు, హరి హరనాథ్, సత్యవతి, భవాని పాల్గొన్నారు.

అదనపు పనిభారం తగ్గించాలి

- డోర్ టు డోర్ సర్వే నుంచి తక్షణమే మినహాయింపు ఇవ్వాలి
- రెండు వారాల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం
- ప్రభుత్వానికి గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల అల్టిమేటం



జోన్-8 కార్యాలయంలో జెడ్సీ శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయాల ఉద్యోగులు

పెందుర్తి: వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కలిగిస్తూ, డోర్ టూ డోర్ సర్వే బాధ్యతలు తమకు అప్పగించడం దారుణమని గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆక్షేపించారు. కార్యాలయాల్లో విధుల భారమే అధికంగా ఉంటే సర్వే పేరిట ఇంటింటికీ తిరగాలనడం సరికాదన్నారు. రాష్ట్ర గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంతాల సచివాలయ ఉద్యోగులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. మండలంలోని 9 గ్రామ సచివాలయాల ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో కొల్లి వెంకట్రావుకు, జీవీఎంసీ జోన్-8 పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగులు వేపగుంటలోని జోన్-8 కార్యాలయంలో ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్ శంకరరావుకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఇప్పటికే అనేక సేవలు ప్రజలకు అందించడంలో తలమునకలై ఉంటున్నామన్నారు. తాజాగా ఈ సర్వే పని ఒత్తిడి పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రెండు వారాల్లో తమ భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. జోన్-8 సచివాలయ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు బండారు శ్రీనివాస్, ఎన్.పార్థసారథి, ఆర్.రమేష్, భార్గవి, చైతన్య, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి రెండు, జోన్-3 నుంచి మూడు, జోన్-4 నుంచి రెండు, జోన్-5 నుంచి ఐదు, జోన్-6 నుంచి ఒకటి, జోన్-8 నుంచి తొమ్మిది వినతులు అందాయన్నారు. నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీసీపీ ఆదేశించారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. పాలకులు అలా చేయకుండా నిధులను పక్కదారి పట్టించడం దారుణమన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే తెరిపించాలన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్య, ఉద్యోగాల్లో సముచిత స్థానం లభించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లోని 47 విభాగాలను ఈవోఐ పేరిట ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కేవీపీఎస్ గౌరవాధ్యక్షుడు వై.టి.దాస్, పుల్లారావు, డి.హెచ్.పిస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.రాజు, జి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు బయాలజీ మెటీరియల్ అందజేత



బయాలజీ మెటీరియల్‌తో విద్యార్థులు

పెదగంట్యాడ: మండలంలోని యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ బయాలజీ టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆ పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గద్దం మేరీ సుజాత శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్. అప్పారావు, పాఠశాల కమిటీ చైర్మన్ మంగ తదితరులు పాల్గొన్నారు.